మామిడి రైతుల దిగాలు

- మామడి తోటల్లో కనిపించని పూత
- దిగుబడిపై తీవ్ర ప్రభావం


ఉస్తినిపల్లి వద్ద పూతలేని మామిడి తోట


పూతకు బదులు ఇగుర్లు వచ్చిన మామిడి చెట్టు

తనకల్లు: అకాల వర్షాలు, చీడపీడలతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏటా నవంబర్ చివరికి మామిడి పూత వస్తుంది. అయితే డిసెంబర్ సగం రోజులు దాటినా ఇంతవరకు మామిడి పూత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 1000 ఎకరాలకు పైగానే మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. సాదారణంగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో మామిడి పిందెలు ఏర్పడుతుంటాయి. ఏప్రిల్, మే నెలల్లో కాయలు కోతకు వస్తుంటాయి. గత ఏడాది దిగుబడి లేక మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఆందోళనలో రైతులు

వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా ఈసారి ఇంకా పూత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని రైతులు టమాట పంట తరువాల అత్యధికంగా మామిడి తోటలను సాగు చేసి ఉపాధిని పొందుతున్నారు. గతేడాది దిగుబడి రాక అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఈ ఏడు దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురయ్యేలా ఉంది. డిసెంబర్ నెల సగం పూర్తయినా ఇంతవరకు పూత జాడ లేదని రైతులు వాపోతున్నారు. పూత రావాల్సిన సమయంలో ఇగుర్లు వస్తున్నాయని రైతులు కలవర పడుతున్నారు. పూత జాడ లేకపోవడంతో కాపు కూడా వస్తుందో రాదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి మామిడి తోటలో దుక్కులు చేసుకొని పూత కోసం ఎదురు చూస్తున్నామని రైతులంటున్నారు. పంటను పురుగు నుంచి కాపాడుకోదానికి రైతులు మందుల కోసం భారీగా వెచ్చిస్తున్నారు. దీంతో రైతులపై అదనపు ఆర్థికభారం పడుతోంది. గతేడాది కూడా ఎరువులు, పురుగుల మందుల కోసం వేలాది రుపాయిలు ఖర్చు చేశామని, అయితే సగం పంట కూడా దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయినట్లు గుర్తు చేస్తున్నారు. ఈ ఏడాదైనా మంచి దిగుబడి వస్తే అప్పులను తీర్చుకోవచ్చనే ఆశతో తోటలకు ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేశామని చెబుతున్నారు.

గతేడాదీ నష్టపోయాం



మేము 15 ఎకరాల్లో మామిడి తోట సాగు చేసాం. గతేడాదీ ఆశించిన దిగుబడి లేకపోవడంతో నష్టపోయాం. ఈ ఏడాది ఇంతవరకు పూత రాలేదు. పూత బదులు ఇగుర్లు వస్తున్నాయి. దీని ప్రభావం దిగుబడిపై ఉంటుంది. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి.

– సలీం, మామిడి రైతు, ఉస్తినిపల్లి

వాతావరణ ప్రభావంతో పూత ఆలస్యం



మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా మామిడి పూత రావడం ఆలస్యం అయ్యింది. డిసెంబర్ నెల చివరికల్లా పూత వస్తుంది. మామిడి రైతులకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించింది. ఎకరాకు రూ.1,800 రైతులు చెల్లించాల్సి ఉంటుంది.

– లావణ్య, హార్టికల్చర్ అధికారి, తనకల్లు

క్లుప్తంగా

అధ్యాపకుడికి లీడర్‌షిప్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు


డా. వేముల వీరాస్వామి

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకుడు వేముల వీరాస్వామి లీడర్‌షిప్ ఆఫ్ ఎక్సలెన్స్–2024 అవార్డుకు ఎంపికయ్యారు. న్యూఢిల్లీకి చెందిన రిఫాసిమెంటో ఇంటర్నేషనల్ సంస్థ వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న దేశ,విదేశాల్లోని ప్రముఖ వ్యక్తులను గుర్తించి అవార్డును ప్రదానం చేస్తారు. అలాగే ఈ అవార్డు విజేతలు, వారి జీవిత వివరాలతో కూడిన ఓ ప్రత్యేక పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పుస్తకంలో వీరాస్వామికి చోటు లభించడం పై పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన


విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

కదిరి టౌన్: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక టవర్ క్లాక్ వద్ద విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ కరెంటు బిల్లులను దహనం చేసి నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలపై భారాలు వేయకుండా మంచి పరిపాలన అందిస్తామని టీడీపీ నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీల రూపంలో రూ.వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. కార్పొరేట్ కంపెనీల లాభం కోసమే స్మార్టు మీట్లరు బిగిస్తున్నారని ఆరోపించారు. వివిధ రకాల చార్జీల పేరుతో ప్రజలపై మోపిన భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

యువకులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కదిరి అర్బన్: కదిరి– ముత్యాలచెరువు రోడ్డుపై సైలెన్సర్ తీసేసి అతివేగంగా వాహనం నడుపుతున్న ఐదుగురు యువకులకు శనివారం రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. యువకుల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. పిల్లల నడవడికను తల్లిదండ్రులు రోజూ గమనించాలన్నారు. అతివేగంగా వాహనం నడిపితే వారు ప్రమాదానికి గురవడమే కాకుండా రోడ్డుపై వెళ్తున్న అమాయకులు బలి కావాల్సివస్తుందన్నారు.

అన్నీతామై అంత్యక్రియలు


అంత్యక్రియలకు మృతదేహాన్ని తీసుకెళ్తున్న సొసైటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: అనాథలకు ఖిద్మత్– ఎ–ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అన్నీతామై అంత్యక్రియలు నిర్వహించారు. శనివారం చిత్రావతి రోడ్డులో నివాసముంటున్న సత్యసాయి భక్తుడు లక్ష్మీపతి (90), బిహార్‌కు చెందిన హెర్నెస్ట్ బెర్నెరో(75) మృతి చెందారు. వారికి తెలిసిన వారు ఎవరూ లేకపోవడంతో స్థానికులు ఖిద్మత్ ఎఖల్క్ సొసైటీ సభ్యులకు సమాచారం అందించారు. కమిటీ సభ్యులు షామీర్, అలీ, చాందు, షఫీవుల్లా, నయాజ్ తదితరులు మృతదేహాలను కర్ణాటకనాగేపల్లి శ్మశాన వాటికకు తీసుకెళ్లి సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ పెద్దలు, ప్రజలు కమిటీ సభ్యులను అభినందించారు.

గూగూడుకు కర్ణాటక వాసుల పాదయాత్ర


పాదయాత్రగా గూగూడుకు వెళ్తున్న మల్లాసంద్ర గ్రామస్తులు

బత్తలపల్లి: కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్ తాలుకా మల్లాసంద్ర గ్రామస్తులు నార్పల మండలం గూగూడు కుళ్లాయిస్వామి దర్శనానికి పాదయాత్ర చేపట్టారు. శనివారం వారు బత్తలపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభించారు. పాదయాత్ర చేపట్టిన కమల్‌బాబు(ఆర్‌టీఓ), మల్లిఖార్జున్‌రెడ్డి, రియాజ్(ఏఈఓ), బాబు(పీడీఓ), ఆదినారాయణరెడ్డి, కన్న, హరీష్, హుసేన్, అక్బర్, చందు, నవీన్, బాషా మాట్లాడుతూ తాము నాలుగేళ్ల నుంచి తమ గ్రామం నుంచి కాలినడకన గూగూడుకు చేరుకుని కుళ్లాయి స్వామిని దర్శించుకుంటున్నామన్నారు.

జర్నలిస్టులపై దాడి చేసిన గూండాలను అరెస్ట్ చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న జాప్ నాయకులు

ధర్మవరం రూరల్: వైఎస్సార్ జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల కవరేజి కోసం వెళ్లిన సాక్షి టీవీ విలేకరి శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, రిపోర్టర్ రాజారెడ్డిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని జర్నలిస్ట్స్ అసోషియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జాప్) సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఆదినారాయణ, ధర్మవరం డివిజన్ అధ్యక్షులు దాసరి సురేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టులపై దాడి చేయడమే కాకుండా కెమరాలు, సెల్‌ఫోన్లను లాక్కొని పగుల గొట్టడాన్ని దుర్మార్గమన్నారు. జర్నలిస్టులపై దాడుల నియంత్రణ కమిటీలను ప్రభుత్వం వెంటనే నియమించాలన్నారు. కార్యక్రమంలో జాప్ పట్టణ కార్యదర్శి ఎం.ఈశ్వర్, కోశాధికారి గణేష్, నరసింహ, శివ పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరండి

ఎన్పీకుంట: కడపలోని జయరాజ్ గార్డెన్ సమీపంలో ఆదివారం జమియత్ ఉలమా హింద్ పర్యవేక్షణలో నిర్వహించనున్న బహిరంగ సభకు మండలంలోని ముస్లింలు అధిక సంఖ్యలో తరలిరావాలని మండల ఖాజీ హజ్రత్ బాబ్జాన్ కోరారు. స్థానిక జామియా మసీదులో శనివారం పలువురు మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నియంతృత్వానికి, మైనారిటీల అణచివేతకు వ్యతిరేకంగా గళం విప్పడం కోసం బహిరంగ సభ నిర్వహిస్తున్నారన్నారు. సభకు హజ్రత్ మౌలానా సయ్యద్ అర్షద్ మదనీ హాజరవుతున్నారు.

బాధితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం


ఆవుటాల రమణారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి


రామ్మోహన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: బాధితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుక్కపట్నం మండలం మారాలకు చెందిన పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌పై ఇటీవల పోలీసులు అక్రమ కేసు బనాయించడంతో శనివారం అతడిని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. బుక్కపట్నం మండలం నార్శింపల్లి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రాంబొజ్జి నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి రాంబొజ్జి నాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మృతుడి కుమారుడు సుధాకర్‌నాయక్ కుటుంబ సభ్యులను శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. ఇదిలా ఉండగా ఇటీవల మోకాళ్ల ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న జిల్లా అగ్రీ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డిని పరామర్శించారు. ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, యాదలంకపల్లి మాజీ సర్పంచ్ గంగమనాయుడు ఉన్నారు.

ఓడీచెరువు: కుసుమవారిపల్లికి చెందిన నారాయణ రెడ్డి మాతృమూర్తి రామకృష్ణమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని రామక్రిష్ణమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు లక్ష్మిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి , షామీర్ బాషా ఉన్నారు. ఇదిలా ఉండగా తంగేడుకుంటలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్త పీరాసాబ్‌ను మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. సర్పంచ్ ఫరీధా భాను, రఫీ, జయసింహ, బీసీ సెల్ మధు, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్ ఉన్నారు.

లోక్ అదాలత్‌లో 259 కేసుల పరిష్కారం


న్యాయవాదులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి


పుట్టపర్తిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి రాకేష్


ధర్మవరం జడ్జీల సమక్షంలో రాజీ అవుతున్న కక్షిదారులు

కదిరి టౌన్: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 259 కేసులు పరిష్కరించినట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.జయలక్ష్మి తెలిపారు. మెగా లోక్ అదాలత్‌లో మూడు బెంచ్‌లు ఏర్పాటు చేసి కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. జూనియర్ సివిల్ జడ్జి ప్రతిమ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి హాజరయ్యారు. కక్షిదారులకు పట్టణ సీఐ నారాయణరెడ్డి భోజనవసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు శివప్రసాద్, రవీంద్ర, చత్రీనాయక్, ఆంజనేయులు, కాలేనాయక్, వర్ధన్‌రెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, కార్యదర్శి సురేంద్ర, సీనియర్ న్యాయవాదులు కృష్ణమూర్తి,గురులింగస్వామి,సుబ్బరాజు గుప్తా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: రాజీ కాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారమని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ పేర్కొన్నారు. శనివారం జూనియర్ సివిల్ జడ్జి అధ్యతన పుట్టపర్తి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. ఈసందర్భంగా 129 కేసులు పరిష్కారమయ్యాయి. జడ్జి మాట్లాడుతూ చిన్నపాటి తగాదాలకు పట్టింపులకు పోయి కేసులు నమోదు చేసుకొని ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి నష్టపోకుండా లోక్ అదాలత్‌లో రాజీ కావాలన్నారు. పుట్టపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తిగంగిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు రాజేంద్రప్రసాద్‌రెడ్డి, నిడిమామిడి శ్రీనివాసులు, ముదిగుబ్బ శ్రీనివాసులు, లెక్కల యధుభూషణ్, ఇందిర, పూజారి ప్రసాద్, చల్లా చంద్రశేఖర్, భారతి రెడ్డి, అరుణ్ కిరణ్, మౌనిక, ఝాన్సిరాణి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పే తుది తీర్పు అవుతుందని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి పేర్కొన్నారు. శనివారం ధర్మవరం కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీలు మాట్లాడుతు రాజీకి తగ్గ కేసులు మాత్రమే నిర్వహిస్తానన్నారు. లోక్ అదాలత్‌లో 371 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. బార్ అసోషియేషన్ కమిటీ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ రహిమాన్ ఇక లేరు


కేఎస్ రహిమాన్ (ఫైల్)

కదిరి: కదిరి మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ కేఎస్ రహిమాన్(78) ఇక లేరు. ఆయన శనివారం కదిరిలో తన స్వగృహంలో కన్నుమూశారు. ఈయనకు ఒక్కసారిగా బీపీ తగ్గిపోవడంతో వెంటనే వైద్యులు పరీక్షించి చికిత్స అందించే లోపే ఆయన మృతి చెందారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు ఈయన అత్యంత సన్నిహితుడు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైతం 2019 సార్వత్రిక ఎన్నికలకు మునుపు తన పాదయాత్రలో భాగంగా కదిరికి విచ్చేసినప్పుడు నేరుగా ఈయన ఇంటికి వెళ్లి ఈయనను పరామర్శించి వచ్చారు. వైఎస్సార్ కుటుంబం అంటే కేఎస్ రహిమాన్‌కు ఎనలేని అభిమానం. ఎన్నో ఏళ్లుగా ఈయన కదిరిలో హమాలీ యూనియన్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈయన కుమారుడు కేఎస్ షబ్బీర్ సైతం వైఎస్సార్‌సీపీ తరపున ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్నారు. కేఎస్ రహిమాన్‌కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు ఈయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

శుభకార్యం

ఓడీచెరువు: తంగేడుకుంటలో శనివారం గ్రామానికి చెందిన రమేష్‌బాబు కుమార్తె శ్రీవల్లికు అమర్‌నాథ్‌తో వివాహం జరిగింది. మాజీ శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షామీర్ బాషా, మెడికల్ స్టోర్ శ్రీనివాసరెడ్డి, మధు ఉన్నారు

నల్లమాడ: బాసంవారిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత దాసరి మాధవరెడ్డి కుమారుడు వివేకానందరెడ్డి వివాహం పల్లవితో ఇటీవల జరిగింది. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం గ్రామానికి వెళ్లిన నూతన దంపతులను ఆశీర్వదించారు. మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, ఎంపీటీసీ శివారెడ్డి, నాయకులు మాధవరెడ్డి, దుద్దుకుంట వెంకటరెడ్డి, కుళ్లాయినాయక్, కె. సాంబశివారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, షంషీర్, దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి, శంకర్‌నాయక్, రామక్రిష్టారెడ్డి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట


అలంకరణలో ఆంజనేయుడు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని యర్రంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. చివరి రోజైన శనివారం దేవాలయంలో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్టించారు. అనంతరం విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం


రథంపై ఊరేగుతున్న అయ్యప్పస్వామి


జ్యోతులు పట్టిన చిన్నారులు

బత్తలపల్లి: మండలకేంద్రంలో శనివారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో వెండి రథంలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి గురుస్వామి శెట్టప్ప స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులు జ్యోతులు పట్టుకుని స్వాగతం పలుకుతుండగా అయ్యప్పలు పేటతుల్లి ఆడుతూ బాణసంచా కాలుస్తూ ముందుకు సాగారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లైటింగ్ గొడుగులు ఆకట్టుకున్నాయి. రాత్రి 9గంటలకు ఉత్సవ విగ్రహం ఆలయానికి చేరుకుంది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జక్కంపూటి సత్యనారాయణ, అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యులు జక్కంపూటి పురుషోత్తంచౌదరి, జక్కంపూటి నాగభూషణ, వడ్డె బొజ్జప్ప, గోగుల కాటమయ్య, అక్కిం ప్రతాప్, బోయపాటి అప్పస్వామి, జొన్నలగడ్డ రంగానాయుడు, బొమ్మినేని రాము, తొట్లు వేణు, కుమ్మర శివయ్య, ఫోటో స్టుడియో మహేష్, వక్కల శ్రీనివాసులుతో పాటు గ్రామపెద్దలు, అయ్యప్పస్వామి మాలదారులు, శివస్వామి మాలదారులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా సాగునీటి సంఘాల ఎన్నికలు


ఎన్నికల తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిమర్రి: ఎం.అగ్రహారం చెరువు సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం సజావుగా జరిగాయి. తొలుత ఆరుగురు ప్రాదేశిక సభ్యుల ఎన్నిక నిర్వహించారు. వీరిలో నీరుగంటి నారాయణమ్మను చైర్‌పర్సన్‌గా, పిన్నదరి నాగయ్యను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఎంపీడీఓ వెంకట రంగారావు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు.

గాండ్లపెంట: పోరెడ్డిచెరువు సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా పోరెడ్డిరామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సిఎస్.హైదర్‌వలీలను ఎన్నుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్నికల అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికలను తహసీల్దార్ బాబురావు, ఇరిగేషన్ ఏఈఈ అరుణలు పర్యవేక్షించారు.

బత్తలపల్లి: అప్పరాచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా కట్టుబడి ఆదినారాయణ, ఉపాధ్యక్షుడిగా ముసుగు నారప్పతో పాటు నలుగురు ఈసీ మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎంపీడీఓ నరసింహనాయుడు శనివారం పేర్కొన్నారు. దంపెట్ల బాలాదేవి చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఉపేంద్రనాయుడు, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్‌నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, ఏఓ ఓబిరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ పోటీలో లేకపోవడంతో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి.

కదిరి అర్బన్: మండలంలో మొత్తం 4 చెరువులకు శనివారం సాగునీటి సంఘం నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్నం రంగనాయకి చెరువు అధ్యక్షుడిగా రమణానాయక్, ఉపాధ్యక్షుడిగా శీనూనాయక్, దేవరచెరువు అధ్యక్షుడిగా గణేష్‌కిర ణ్, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్‌నజీర్, ముత్యాలచెరువుకు అధ్యక్షుడిగా ఉపేంద్ర, ఉపాధ్యక్షుడిగా రామచంద్ర, విఠలరాయునిచెరువు అధ్యక్షుడిగా ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా రామాంజినేయులును ఎన్నుకున్నారు. దేవరచెరువు ఎన్నికలను తహసీల్దార్ మురళీక్రిష్ణ, ఎంపీడీఓ పోలప్ప పర్యవేక్షించారు.

తలుపుల : మండలంలో శనివారం జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో పెద్దన్నవారిపల్లి కొత్తచెరువు సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రాజారెడ్డి, సలీమా, పులిగుండ్లపల్లి చెరువు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా శ్రీరాములు, రామచంద్ర, కుర్లి చెరువు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఎంపీడీఓ రామానాయక్, ఇరిగేషన్ ఏఈ అనీల ఎన్నికలను పర్యవేక్షించారు.

ధర్మవరం రూరల్: మండలంలో శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. ధర్మవరం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా రేనాటి శ్రీనివాసులు, గొట్లూరు అధ్యక్షుడిగా చంటప్ప, పోతుకుంట అధ్యక్షుడిగా లక్ష్మన్న, రేగాటిపల్లి తిమ్మారెడ్డిగారి కొండారెడ్డి, రావులచెరువు అధ్యక్షులుగా లక్ష్మిరెడ్డి, కట్టకిందపల్లి అధ్యక్షులుగా నరసింహారెడ్డి, చింతలపల్లి అధ్యక్షుడిగా పెద్ద కాటమయ్య, సీసీ కొత్తకోట అధ్యక్షుడిగా నారపరెడ్డిని ఎన్నికైనట్లు తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు కుట్రమయం

ఎన్పీకుంట: సాగునీటి సంఘాల ఎన్నికలను కూటమి ప్రభుత్వం అంతా కుట్రమయం చేసిందని పెడబల్లి, వంకమద్దికి చెందిన పలువురు రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. శనివారం వారు మాట్లాడుతూ రైతులకు సభ్యత్వం ఇవ్వకుండానే అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని ప్రముఖ పారిశ్రామికవేత్త హరీష్‌రెడ్డి, ఆయకట్టు రైతులు ఎం.పుల్లారెడ్డి, మహబూబ్ బాషా, నారాయణస్వామి, రామచంద్ర, రామక్రిష్ణ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ధనియానిచెరువు సాగునీటి సంఘం అధ్యక్షురాలిగా పి.గోవిందమ్మ, ఉపాధ్యక్షురాలిగా సామల ఈశ్వరమ్మ, వంకమద్ది సాగునీటి సంఘానికి అధ్యక్షులుగా ఎన్.లక్ష్మీనరసు, ఉపాధ్యక్షుడిగా పి.నాగేంద్ర, పెడబల్లి సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా పూలకుంట రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా బి.జయచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ఇన్‌చార్జ్ మహేష్ తెలిపారు.

అప్పస్వామికి ప్రత్యేక పూజలు



బత్తలపల్లి: మార్గశిర మాసం చివరి శనివారం గంటాపురం గ్రామంలో వెలిసిన గురజాల అప్పస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు గోపాల స్వామి అప్పస్వామి ములవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. దీపకాంతుల్లో అప్పస్వామి భక్తులకు కనువిందు చేశారు.